నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం అక్టోబర్ 20, 2024 www.navatelangana.com

నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీగా సింధుశర్మ

- కామారెడ్డి ఎస్పీకి అదనపు బాధ్యతలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్‌గా సింధుశర్మకు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కామారెడ్డి ఎస్పీగా పని చేస్తున్న సింధుశర్మకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గత సీపీ కల్మేశ్వర్ కేంద్ర సర్వీస్‌లోని పోలీస్ అకాడమీకి డిప్యూటేషన్‌పై వెళ్తున్న విషయం విధితమే. శనివారం ఆయన రిలీవ్ కావడంతో సింధుశర్మకు ఇన్‌చార్జి సీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు మూసివేత



నవతెలంగాణ-మెండోరా

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లోకి వరద ప్రవాహం తగ్గడంతో ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం కలిగి ఉండేలా చర్యలు చేపడుతూ ప్రాజెక్టు అధికారులు గేట్లు మూసివేసి గోదావరి నదిలోకి నీటి విడుదల నిలిపివేశారు. శుక్రవారం రాత్రి 20,720 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి చేరుతుండగా వరద ప్రవాహం తగ్గి శనివారం 14,454 క్యూసెక్కుల వరద చేరుతుంది. ప్రాజెక్టులో నుండి మిగులు జలాలు దిగువకు విడుదల చేస్తూ కాకతీయ కాలువ ద్వారా 5,800 క్యూసెక్కులు , ఎస్కేప్ గేట్ల ద్వారా 2200 క్యూసెక్కులు , వరద కాలువకు 5000 క్యూసెక్కులు , లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు , సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీరు వదులుతూ మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల త్రాగునీరు సరఫరా చేస్తుండగా 573 క్యూసెక్కుల నీరు వృథాగా ఆవిరి అవుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(80.5 టీఎంసీలు) అడుగులతో నిండుకుండలా పూర్తి స్థాయిలో నిండుకుని ఉంది.

ఒకే దేశం.. ఒకే ఎన్నిక
రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే



మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి

- ప్రజా, కార్మిక సంక్షేమం విస్మరించి కార్పొరేట్‌లకు వంతపాడుతున్న ఎన్‌డీఏ సర్కార్
- పెట్రో ధరలతో నిత్యావసరాలు భారం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి
- అట్టహాసంగా సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా 3వ మహాసభ


సీపీఐ(ఎం) జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్.. నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ-కామారెడ్డి

'ఎన్‌డీఏ ప్రభుత్వానికి నిరుద్యోగం, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులపై లేని శ్రద్ధ ఒకే దేశం, ఒకే ఎన్నికపై ఉంది. ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే అవుతుందని' సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి అన్నారు. బిజెపి ప్రభుత్వం గత రెండుసార్లు అధికారంలో ఉండి కార్పొరేట్ల కోసం వంత పాడుతూ సామాన్య ప్రజలకు, కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తూ వచ్చిందని, ప్రస్తుతం ఎన్డీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసినా అదే తీరుగా వ్యవరిస్తుందని అన్నారు. సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా 3వ మహాసభలను జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. మహాసభలకు హాజరై ఆమె ప్రసంగించారు. హర్యానాలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో లైంగిక దాడి కేసులో అరెస్ట్ అయిన డేరా బాబాను పెరోల్‌పై బయటకు పంపి ఎన్నికల ప్రచారంలో వాడుకున్నా రన్నారు. ఒక కుటుంబంపై దాడి చేసి గర్భవతిగా ఉన్న మహిళలపై లైంగికదాడి చేస్తే అలాంటి వారికి గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టడం, బిజెపి పార్టీ ఇలాంటి వారికి వంత పడుతుందన్నారు. మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెడితే ఇంకా ఆమోదించబోని బీజేపీ.. అలాంటిది ఒకే దేశం ఒకే ఎన్నికను మాత్రం నిర్వహించాలని చూస్తుందని మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు 18 శాతం తగ్గితే భారత దేశంలో మాత్రం చమురుదలను తగ్గించడం లేదన్నారు. దీంతో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులకు భారంగా మారుతోందని ఆమె అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా కృషి చేయాలి. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేది వదిలి ఒక పార్టీపై ఒక పార్టీ విమర్శలు చేసుకోవడంతోనే కాలం సరిపెడుతున్నరన్నారు. గత పాలకులు ప్రజలకు సేవ చేయలేరని గత ఎన్నికల్లో వారిని పక్కకు పెట్టారని అదే పద్ధతిలో ఈ ప్రభుత్వం కూడా కొనసాగితే వీరిని కూడా ప్రజలు పక్కన పెడతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడిచిన పూర్తి స్థయిలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఉచిత బస్సు, ఉచిత విద్యుత్ మినహా ఇతర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. రైతుబంధు రుణమాఫీ 50 శాతం మాత్రమే చేసి మళ్లీ ఆ విషయం తీయడం లేదన్నారు. గత ప్రభుత్వం రేషన్ కార్డు ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం రేషన్ కార్డు ఇవ్వకుండా డిజిటల్ కార్డు ఇస్తామని కాలయాపన చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కావాలో వాటిపై చర్చించి తీర్మానం చేయనున్నట్టు తెలిపారు.






మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్, చంద్రశేఖర్, రవీందర్

మత విద్వేషాలను తిప్పికొట్టాలి

పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్ రమ మాట్లాడుతూ

మనం ప్రతి సంవత్సరం పార్టీ జిల్లా సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఆ జిల్లాలో మనం ఎంతవరకు పేద ప్రజల కోసం కొట్లాడాము ఎంతవరకు పోరాటాలు చేశామని చర్చించుకొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త ముందుకు వచ్చి పని చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మత విభేదాల సృష్టించి ఓట్లు పొందాలని చూస్తుందని దానిని తిప్పి కొట్టి పేద ప్రజలకు న్యాయం చేసే విధంగా కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు.

రాజ్యాంగం ప్రకారం కనీస వేతనాలను అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు లేకుండా వారిని అందరినీ పర్మినెంట్ చేసే వరకు పోరాటాలు చేపట్టనున్నట్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ తెలిపారు.

మహాసభల ప్రారంభోత్సవం ముందు సీపీఐ(ఎం) జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మోతిరాం నాయక్, రవీందర్, సురేష్ గోండ, నర్సింలు అరుణ్, యాదగిరి గౌడ్, అజయ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.


మహాసభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

బీజేపీ పాలనలో కార్పోరేట్‌లకే లాభం

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

బిజెపి పాలనలో కేవలం కార్పొరేట్ సంస్థలే లాభం పొందుతున్నాయని పేదల కడుపు కొడుతూ పెద్దల పొట్టలు నింపుతున్న బిజెపి ప్రభుత్వం పేదల గురించి ఆలోచించడం లేదనిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అనానరు. బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తుందని, కార్మికులకు లాభాలు కలిగే విధంగా ఎలాంటి చట్టాలు ఇప్పటివరకు చేయలేదని, ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం పేద ప్రజల కోసం ఆలోచించాలన్నారు. ఇది ఇలాగే కొనసాగితే బంగ్లాదేశ్ పరిస్థితి భారత దేశంలో కొనసాగే అవకాశం ఉందన్నారు. పేద ప్రజలు తమ నుండి ప్రభుత్వం దోపిడీని కొంతవరకు సహిస్తారని, వారి సహనం నశించినప్పుడు ఎంతటి వారినైనా ఎదిరించేందుకు ముందుకు వస్తారన్నారు ఇందుకు ఉదాహరణ బంగ్లాదేశ్ ప్రజలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం రాజరికం చట్టాలను అమలు చేస్తుందని 90 శాతం వికలాంగులైన ప్రొఫెసర్ సాయిబాబా ఎలాంటి నేరం చేయకున్నా దేశద్రోహం నెపంతో 10 సంవత్సరాలు జైలులో ఉంచి చివరికి నేరం రుజువు కాలేదని విడుదల చేశారన్నారు. ఈ 10 సంవత్సరాల కాలం ఆయన తన కుటుంబానికి ఆయన వ్యక్తిగత జీవితానికి విఘాత కలిగించిన ప్రభుత్వం అలాంటి చట్టాలను రద్దు చేయవ లసిన అవసరం ఉందన్నారు. కాలానికి అనుగుణంగా చట్టాల ను రూపొందించుకోవాల్సింది పోయి, పేద ప్రజలకు వివిధ ప్రజలకు వ్యతిరేకంగా చట్టాలను తయారు చేస్తున్నారన్నారు.

పేరులో ఇంటర్‌నేషనల్..
ప్రమాణాలు శూన్యం



- లహరీ, వంశీ ఇంటర్నేషనల్ హోటల్స్ స్టాండర్డ్స్.. ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ తనిఖీలతో తేటతెల్లం
- ఫ్రిడ్జ్‌లో కుళ్లిన మాసం.. రంగులు వేస్తూ విక్రయం
- మసాల పొడులు, అల్లంవెల్లుల్లి పేస్ట్‌కు ఫంగస్.. అలానే వినియోగిస్తున్న వైనం
- మాంసం, ఫేస్ట్ ధ్వసం చేసి నోటీసులు జారీ
- ఢిల్లీ వాల స్వీట్ హోమ్‌కు సైతం.. శాంపిళ్లు సేకరణ


లహరీ ఇంటర్నేషనల్ నుంచి స్వాధీనం చేసుకున్న కుళ్లిన మాంసం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేరుకు పెద్దపెద్ద స్టార్ హోటళ్లు.. ఖరీదైన భోజనాలు. తీరా చూస్తే.. కుళ్లిపోయిన మాంసం, రంగులు కలిపిన మాంసంతోనే వడ్డిస్తున్నట్టు మరోసారి తేటతెల్లం అయింది. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్స్ రోహిత్ రెడ్డి, పి.స్వాతి, శీర్షికతో కూడిన బృందం పర్యటన నిజామాబాద్ నగరంలోని పలు హోటళ్లల్లో శనివారం దాడులు నిర్వహించింది. నగరంలోని లహరి, వంశీ ఇంటర్నేషనల్ హోటల్స్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లహరి ఇంటర్నేషనల్ రెస్టారెంట్ నందు రిఫ్రిజిరేటర్‌లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతను వినియోగించకుండా ఫుడ్ గ్రేడ్ లేని ప్లాస్టిక్ కవర్లల్లో భారీగా నిర్వహించిన 122.5 కిలోల గల రూ.30 వేల విలువ గల కుళ్లిన మాంసం ఉత్పత్తులను గుర్తించారు. హానికర ప్రమాదకరమైన రంగులను కలిపిన చికెన్, రూ.24 వేల విలువ గలిగిన మసాలా మిర్చి పేస్ట్‌లను, ఫంగస్ బూజు పట్టిన కూరగాయలను గుర్తించడంతో హెూటల్ యాజమాన్యం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడే ప్రజల ఆరోగ్యానికి భంగం కలవకూడదని మాంసపు ఉత్పత్తులను ధ్వంసం చేసి నోటీసులు జారీ చేశారు.

అలాగే వంశీ ఇంటర్నేషనల్ హెూటల్ నందు ఫ్రిడ్జ్ రిఫ్రిజిరేటర్లల్లో నిల్వ ఉంచిన హానికరమైన రంగులతో కూడిన మాంసపు ఉత్పత్తులు ఉడకబెట్టిన మిర్చి పేస్ట్ కాలం చెల్లిన మసాలా పొడులు గుర్తించి ధ్వంసం చేశారు. రూ.24 వేల విలువ చేసే మాంసం స్వాధీనం చేసుకున్నారు. తర్వాత ఆహార పదార్థాలు తయారు, నిల్వ చేసే కిచెన్‌కు సరైన వెలుతురు లేకుండా అపరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హెూటల్ యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో మండిపడి పలు ఎఫ్ఎస్ఎస్ఏ కి సంబంధించిన నోటీసులు జారీ చేశారు. పలు అనుమానాస్పద శాంపుల్స్‌ను సేకరించారు.

మిర్చి కాంపౌండ్‌లోని పలు మసాలా కారం పసుపు తయారీ కేంద్రాలపై దాడులు జరిపి అనుమానాస్పద శాంపులను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. ఇంప్రూవ్మెంట్ నోటీసెస్ పలు ఫుడ్ సేఫ్టీ నోటీసులను జారీ చేశారు.


ఢిల్లీ వాలా స్వీట్ హౌస్‌లో..

ఢిల్లీ వాలా స్వీట్ హౌస్ నందు కూడా ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో అక్కడ ఉన్నటువంటి పరిస్థితులను అపరిశుభ్ర వాతావరణం చూసి అధికారులు విస్తుపోయారు. స్వీట్ హౌస్ యాజమాన్యంపై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ ఐన వి.జ్యోతిర్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు నోటీసులు జారీ చేసి పలు శాంపుళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ రకమైన ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఆహార తయారీదారులు, ఆహారం అమ్మేవారు ఎంతటి వారైనా సురక్షితమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని హెచ్చరిస్తూ లేనియెడల చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత శాఖ సహాయంతో సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ టాస్క్ ఫోర్స్ దాడులలో అధికారులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొనడం జరిగింది.


వంశీహోటల్‌లోని కిచెన్ దుస్థితి..


ప్రమాదకర రంగులు కలిపిన బిర్యాని..


నోటీసులు జారీ


ఢిల్లీ వాలా స్వీట్‌హోంలో..

అనాథ బాలలకు ట్రస్ట్ అభినందనీయం

- భవిష్యజ్యోతి ట్రస్ట్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- దాతలు తోడ్పాటును అందించాలని పిలుపు
- పాల్గొన్న జిల్లా జడ్జి, సీపీ, బెటాలియన్ కమాండెంట్



ట్రస్ట్ పేరు, బ్యాంక్ ఖాతా వివరాలు ప్రదర్శిస్తున్న కలెక్టర్, జడ్జి, సీపీ, బెటాలియన్ కమాండెంట్ తదితరులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అనాథ బాలలకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవితకు బాటలు వేయాలనే మహెూన్నత సంకల్పంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్యజ్యోతి ట్రస్ట్‌ను నెలకొల్పడం ఎంతో అభినందనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారుల అభ్యున్నతి కోసం ఏర్పాటైన ఈ ట్రస్ట్ కు అన్ని వర్గాలకు చెందిన దాతలు విరివిగా విరాళాలు సమకూర్చి తమవంతు తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో అనాథ పిల్లల కోసం ఏర్పాటైన ట్రస్ట్‌ను కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ మేరకు శనివారం కోర్టు భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల అధ్యక్షత వహించగా, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, డిచ్పల్లి పోలీస్ బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నా అనేవారెవ రు లేని అనాథ బాలికలకు ప్రాథమిక దశ నుండే నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలనే దృక్పధంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నెలకొల్పిన ట్రస్ట్ కు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. సాధారణంగా న్యాయ సేవాధికార సంస్థలు లోక్ అదాలత్‌ల నిర్వహణ, న్యాయ పరమైన అంశాలపై అవగాహన సదస్సులు వంటి వాటికే పరిమితమవుతాయని, అందుకు భిన్నంగా నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అన్ని శాఖలను సమన్వయము చేసుకుంటూ విస్తృత స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుండడం ముదావహం అని ప్రశంసించారు. తాము అనాథలం అనే భావనను విడనాడి, చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనాథ బాలలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించిన కాకతీయ స్కూల్, రవి పబ్లిక్ స్కూల్, నిర్మల హృదయ్ పాఠశాలల యాజమాన్యాలను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.

జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ, నిజామాబాద్ లోని బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలలకు నాణ్యమైన విద్యను ఇప్పిస్తూ, వారికి అన్ని విధాలుగా తోడ్పాటుగా నిలవాలనే ఆశయంతో భవిష్య జ్యోతి ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థుల చదువుతో పాటు వారికి అవసరమైన ఇతర సదుపాయాలన్ని ట్రస్ట్ ద్వారా సమకూరుస్తామని తెలిపారు. నలుగురు అనాథ బాలలను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ దత్తత తీసుకున్నారని తెలుపుతూ, సీ.పీ కనబర్చిన సేవా దృక్పథాన్ని అభినందించారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, అనాథ బాలలను దత్తత తీసుకునే అవకాశం కలగడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తాను బదిలీపై వెళ్తున్నప్పటికీ దత్తత తీసుకున్న బాలలకు తనవంతు తోడ్పాటును అందిస్తుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి టీ.శ్రీనివాస్, ప్రైవేట్ విద్య సంస్థల నిర్వాహకులు రజనీకాంత్, సరళా మహేందర్, న్యాయాధికారులు, బాలసదన్ చిన్నారులు పాల్గొన్నారు.



అనాథ బాలలకు చక్కటి భవిష్యత్తును అందించేందుకు వీలుగా దాతలు భవిష్య జ్యోతి ట్రస్ట్‌కు విరాళాలు అందించి తమ ఉదారత్వాన్ని చాటుకోవాలని జడ్జి పిలుపునిచ్చారు. ట్రస్ట్ పేరిట ప్రత్యేకంగా నిజామాబాద్ నగరంలోని ఐ.సీ.ఐ.సీ.ఐ బ్యాంకు, నాందేవ్ వాడ బ్రాంచ్ లో అకౌంట్‌ను తెరిచినట్టు తెలిపారు. దాతలు తమ విరాళాలను భవిష్య జ్యోతి, అకౌంట్ నెంబర్: 354705001646, ఐ.ఎఫ్.ఎస్.సీ కోడ్: ఐసీఐసీ003547, ఐసీఐసీఐ బ్యాంకు, నాందేవ్ వాడ బ్రాంచ్ లో జమ చేయవచ్చని సూచించారు.

భార్యతో గొడవ..
కొడుకును వాగులోకి తోసేసిన తండ్రి



నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

భార్యతో గొడవ జరగడంతో కోపంలో క్షణికావేశంలో కన్న కొడుకును వాగులో తోసేశాడో తండ్రి. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణం దేశాయిపేట్‌లో శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన రాములు తన కొడుకు పండరి(14)ని బాన్సువాడ నుంచి బోధన్ వెళ్లే రహదారి మధ్యలో ఉన్న పెద్దపూల్ వాగులో తోసేశాడు.

వివరాలు మెయిన్‌లో..

పోలీసులమని చెప్పి రూ.50 వేలు లూటీ

- మరో రూ.2 లక్షలు తెచ్చివ్వాలని
- ఫోన్‌లో బెదిరింపులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో పోలీసులమని చెప్పి ఒక వ్యక్తి వద్ద 50 వేలు వసూలు చేసిన ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని నాగారామ్‌కు చెందిన నర్సగౌడ్ అనే వ్యక్తి ఈ నెల 17న నగరంలోని ప్రబాత్ టాకిస్ వద్ద ఉన్న మద్యం షాపులో మద్యం సెవిస్తుండగా నలుగురు వ్యక్తులు వచ్చి తాము పోలీసులమని చెప్పి అతడిని అక్కడినుంచి పక్కకు తీసుకెళ్లారు.

వివరాలు మెయిన్‌లో..

జిల్లా ఆసుపత్రి నుంచి బాలుడి కిడ్నాప్

- జీజీహెచ్ నుంచి పెరుగుతున్న కిడ్నాప్, మిస్సింగ్ కేసుల ఘటనలు
- పట్టించుకోని ప్రభుత్వాసుపత్రి సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తండ్రితో పాటు నిద్రిస్తున్న ఎడాది వయస్సు ఉన్న బాలుడు కిడ్నాప్‌కు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా మద్నూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనారోగ్యంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం చేరారు. భార్యతో పాటు భర్త రాజు తన కొడుకు మణికంఠతో కలిసి ఆసుపత్రిలో ఉన్నారు. రాత్రి కావడంతో అక్కడే నిద్రపోయారు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు మణికంఠను ఎత్తుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున లేచి చూసే సరికి తన కోడుకు పక్కన లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివరాలు మెయిన్‌లో..

మొక్కల పెంపకంపై ఒకరోజు శిక్షణ


మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

2034 వరకు అటవీ ప్రాంతంలో చేపట్టే మొక్కల పెంపకం పై ప్రణాళిక సిద్ధం చేయడానికి సెక్షన్ అధికారులు బీట్ అధికారులతో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో రేంజ్ అధికారి రవి మోహన్ భట్ పదేళ్లపాటు అడవుల అభివృద్ధికి చెట్ల పెంపకం ఇతరత్రా కార్యక్రమాలపై చేపట్టనున్న ప్రణాళికపై శిక్షణ లో పలు విషయాలపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి తుకారం రాథోడ్ సెక్షన్, బిట్ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షులు

నవతెలంగాణ-ముప్కాల్

రెంజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కోమటిశెట్టి గంగాధర్ శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. మద్దతు ధర వరికి సన్నాలకు రూ.2,300, దొడ్డువరికి రూ.2,320 ఇస్తారని తెలిపారు. అలాగే ప్రభుత్వం కేటాయించిన 33 రకాల సన్నాలకు రూ.500 రూపాయల బోనస్ అదనంగా పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ముస్కు సంతోష్ రెడ్డి, డైరెక్టర్లు బద్ది ప్రసాద్, క్యాతం గంగారెడ్డి, బద్దం శ్రీనివాస్, సంఘ కార్యదర్శి కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు..

సీపీఐ(ఎం) మండల మహాసభను జయప్రదం చేయండి

- శంకర్ గౌడ్


మాట్లాడుతున్న శంకర్‌గౌడ్

నవతెలంగాణ-నవీపేట్

మండల సీపీఐ(ఎం) 5వ మహాసభకు పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు, సానుభూతిపరులు, అభ్యుదయ వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే మహాసభకు జిల్లా కార్యదర్శి రమేష్ బాబు హాజరవుతారన్నారు. మూడు సంవత్సరాల్లో జరిగిన పార్టీ కార్యక్రమాలపై సమీక్షించుకొని భవిష్యత్తు పోరాట కర్తవ్యాలను రూపొందించుకుంటామని తెలిపారు. సమావేశంలో మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్, ఏశాల గంగాధర్, దేవేందర్ సింగ్, సావిత్రి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డికి లిటిల్ ఫ్లవర్ విద్యార్థిని


కబడ్డీకి ఎంపికైన సన

నవతెలంగాణ-మెండోర

సిర్పాపల్లిలో నిర్వహించిన జోనల్‌స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ వెల్గటూర్ విద్యార్థినిలు హర్శిని, సన మండల స్థాయి టీమ్‌లో పాల్గొని మండల ప్రథమ స్థానంలో నిలిచారు. కాగా కబడ్డీలో బెస్ట్ ఫర్మామెన్స్ స్టూడెంట్‌గా ఎండి.సన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ ఎండి.పాషా తెలిపారు. బాల్కొండలో జరిగిన మండల స్థాయి ఆటల పోటీల్లో గెలిచి జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు హర్శిణి, సనా ఎంపికైనట్లు వివరించారు. జోనల్ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీలలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ఎండి.సనా ను మరియు పాఠశాల పీఈటిని పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించారు. మండల స్థాయి పోటీల నుండి జోనల్‌కు , జోనల్ స్థాయి నుండి జిల్లా స్థాయికి ఆటల పోటీల కు ఎంపికైన సనాను ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు.

షెడ్యూల్డ్ కులాలు, తెగల రక్షణ చట్టంపై అవగాహన

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య


పీపీ రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మి నర్సయ్య శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాల గురించి బాధితులకు, సాక్షులకు సాక్ష్యం ఇచ్చుటలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రక్షణ చట్టాల గురించి వివరించారు. సమావేశంలో నూతనంగా నియమింపబడిన జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రాజేశ్వర్‌ను డిప్యూటీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లాలోని ప్రాసిక్యూటర్లు సత్కరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజారెడ్డి, బంటు వసంత్, శ్యాంరావు, నిమ్మ దామోదర్ రెడ్డి, ఖాందేష్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి. రామకృష్ణ, యం.డి. రహీముద్దిన్, భూసారపు రాజేష్ గౌడ్, చిదిరాల రాణి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శిరీష

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు మండల పశువైద్యాధికారి శిరీష తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలోని 146 గెదలకు, 20 ఆవులకు టీకాలు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల జూనియర్ పశు వైద్యాధికారి శశికళ, వైద్య సిబ్బంది అనిల్, గోపాలమిత్ర, రాజకుమార్, పాడి రైతులు, పాల్గొన్నారు.

ఏటీసీ కేంద్రాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం నగరంలోని శివాజీనగర్‌లో గల ప్రభుత్వ బాలుర, బాలికల ఐటీఐ ప్రాంగణాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ భవన సముదాయాల నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల నాణ్యతను పరిశీలించారు. ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని అధికారులను ప్రశ్నించారు. మరో మూడు మాసాలలో ఏటీసీ కేంద్రాల భవన సముదాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే తొలివిడతగా మంజూరీ లభించిన నిజామాబాద్, బోధన్, కమ్మర్‌పల్లి ఐటీఐలలో ప్రవేశాలు చేపట్టినందున వీటి భవన నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వారం సంబంధిత శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సైతం నిర్మాణ పనుల పరిశీలనకు విచ్చేసే అవకాశాలు ఉన్నందున నాణ్యతతో యుద్ధప్రాతిపదికన పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. వీటి నిర్మాణాల విషయంలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తేవాలన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

సైన్యంలో చేరి దేశరక్షణలో పాలుపంచుకోవాలి

- అమర జవాన్ల సంస్మరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో క్షత్రియ పాఠశాల చేపూర్‌లో వీర్ గాథా 4.0 ఆమరజవాన్ల సంస్మరణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సుబేదార్ అనుజ్ రాణా, హవాల్దార్ తంటారె మహీంద్రా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్కూల్ ప్రిన్స్ పల్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తన స్వాగత ఉపన్యాసంలో అతిథులకు స్వాగతం పలుకుతూ దేశరక్షణలో జవాన్ల ఆత్మ బలిదానలు ఎంతో గొప్పవని, వీటికి వెలకట్ట లేమని అన్నారు. సీబీఎస్‌ఈ విద్యాప్రణాళికలో భాగంగా వీర్ గాథ అనే ఈ కార్యక్రమంను నిర్వహిస్తున్నామని, ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యతకు ఎంతో తోడ్పాటును అందిస్తాయని అన్నారు. మొట్ట మొదటి పరమ వీర చక్ర అవార్డు పొందిన సోమనాద్ శర్మ ప్రాణ త్యాగం వల్ల శ్రీనగర్ ను కాపాడుకున్నా మని అన్నారు. కోశాధికారి అల్జపూర్ గంగాధర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు తనకు జన్మనిచ్చిన తల్లి దండ్రులను, దేశాన్ని మరచి పోకుండా దేశభక్తిని పెంపొదించుకొని అత్యుత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాక్షించారు. సెక్రటరీ అల్జపూర్ దేవేందర్ మాట్లాడుతూ... దేశ భాషలన్నింటిని గౌరవించాలని, మనది భిన్నత్వంలో ఏకత్వం కల్గి యున్న దేశమని, కార్గిల్ యుద్ధ వీరులు స్థానికులు అయిన బాదాం శ్రీనివాస్, ర్యాడ మహేష్ త్యాగాలను కొనియాడారు. దేశ రక్షణలో ఆత్మ బలిదానం చేసిన వీరులకు గుర్తు చేసుకుంటు రక్షణలో ఆత్మ బలిదానం చేసిన వీరులకు, ప్రస్తుతం సేవలు కొనసాగిస్తున్న సైనికులకు పాదాభివందనం చేశారు. సుబేదార్ అనుజ్ రాణా మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో రాత్రి అనక , పగలనక భిన్న శీతోష్ణ స్థితుల్లో దేశ సేవ చేస్తున్న సైనికుల సేవలను, తమ అనుభవాలను వివరించారు. దేశంలో జరిగిన ఎన్నో ఉగ్రదాడులను సమర్థవంతంగా తిప్పికొట్టిన ఘనత వీర సైనికులదేనని అన్నారు. పార్లమెంట్‌పై దాడి పాఠన్ కోట్ , ఫైజాబాద్ మొదలగు వాటిని ఉదాహరించారు. ఇటువంటి వీర్ గాథ కార్యక్రమంలో పాల్గొనటంవల్ల ప్రజలకు మనో ధైర్యం పెరుగుతుందని, సైనికులకు ఆత్మ విశ్వాసం పెరుగుతుందని అన్నారు. హవాల్దార్ టి. మహేంద్ర 4.0 వీర్ గాథను వివరించారు. తన మొదటి ఉద్యోగ బాధ్యత జమ్ము కాశ్మీర్‌లో నిర్వహించానని అన్నారు. మంచు గడ్డ కట్టేంత తీవ్ర చలిలో తాము విధులు నిర్వహించామని అన్నారు. దేశరక్షణలో సైనికులు విధులు ఏవిధంగా నిర్వహిస్తారో విద్యార్థులకు వివరించారు. సైన్యంలో చేరి దేశ రక్షణలో పాలుపంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పలువురికి సన్మానం

దక్షిణ భారత నాటక పోటీలకు విజయ్ విద్యార్థులు


దక్షిణ భారత నాటక పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్‌సీఈఆర్‌టీ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ గోదావరి ఆడిటోరియంలో విశ్వేశ్వరయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మ్యూజియం వారు ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించిన దక్షిణ భారత డ్రామా ఫెస్టివల్-2024లో రాష్ట్రంలోని 28 జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఆ పోటీల్లో విజయ్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన 'సేవ్ వాటర్ హైడ్రా హోప్' అనే నాటిక రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. బెంగుళూరులో నవంబర్ 14,15 తేదీల్లో జరిగే దక్షణ భారతస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నాటకాన్ని రచించిన విజయ్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి టి. విజితేంద్రియని, దర్శకత్వ బాధ్యతలను చేపట్టిన కర స్పాండెంట్ వి.ప్రభాదేవిని, సహాయ దర్శకత్వ బాధ్యత నిర్వహించిన 10వ తరగతి విద్యార్థి పి.శరణ్ తేజను, ఈ పోటీల్లో పాల్గొన్న విజయ్ హైస్కూల్లో పదవ తరగతి చదివే ఎ. తరుణ్, జి.సిరివేద, బి.తనుశ్రీ, రౌధాజహాన్, టి.రవిత్రేయిని, 9వ తరగతి చదివే ఎ. రాజ్‌కరణ్ రెడ్డి, ఎ.శ్రీకర్, 8వ తరగతి చదివే పి. రోహన్‌రెడ్డిని విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత అభినందించారు.

జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు విజయ్ విద్యార్థిని

మండల విద్యాధికారి ఆధ్వర్యంలో సైన్స్ సెమినార్ 2024 కార్యక్రమం జడ్‌పీహెచ్‌ఎస్ బోర్గాం (పి) పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో విజయ్ హైస్కూల్లో 9వ తరగతి చదివే పి.శ్లోక 'ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ – పొటెటియల్స్ అండ్ కార్సర్' అనే అంశంపై గైడ్ చర్ బి. రాజశేఖర్ ఆధ్వర్యంలో పాల్గొని జిల్లాస్థాయి సెమినార్‌కు అర్హత సాధించింది. ఈ సందర్భంగా జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు అర్హత సాధించిన పి. శ్లోకను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న పలువురు

సీపీఐ(ఎం) ఆర్మూర్ ఏరియా నూతన కమిటీ ఎన్నిక

- ఏరియా కార్యదర్శిగా వెంకటేష్



నవతెలంగాణ-ఆర్మూర్

సిపిఐ(ఎం) ఆర్మూర్ ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని శాస్త్రి నగర్‌లోగల పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం ఏరియా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ ఏరియా ఐదవ మహాసభ శుక్రవారం కమల నెహ్రూ కాలనీ మెడికల్ ఏజెన్సీ భవన్‌లో నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో గత మూడు సంవత్సరాల కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏరియా కార్యదర్శిగా పల్లపు వెంకటేష్, ఏరియా కమిటీ సభ్యులుగా కుతాడి ఎల్లయ్య, భూమన్న, సుజాత, కొండ గంగాధర్, విడగొట్టి సాయి, బొర్రా నాగరాజును ఎన్నుకున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని, ప్రభుత్వ హామీలు అమలు కోసం కృషి చేస్తామని అన్నారు. కార్మికులు, రైతులు ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ మహాసభ కు సహకరించిన పత్రికా విలేకరులకు, ఆర్థిక సహకారం అందించిన శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కుతాడి ఎల్లయ్య, భూమన్న, సుజాత, కుల్దీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మార్కెట్ కమిటీలో ఇద్దరి డైరెక్టర్ స్థానాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఆర్మూర్ మార్కెట్ కమిటీలో జక్రాన్ పల్లి మండలానికి చెందిన ఇద్దరికి డైరెక్టర్లుగా అవకాశం కల్పించారని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన కనక రవికి, మండలంలోని గన్యా తండాకు చెందిన పీర్‌సింగ్‌కు ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా అవకాశం కల్పిస్తారని వినిపిస్తోంది. ఇంకా అధికారికంగా ప్రకటన రాలేదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

- డీలర్లతో సమావేశంలో ఏవో



డీలర్లతో మాట్లాడుతున్న ఏవో

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఏఓ వెంకటేష్ ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యాసంగి పంట విత్తనాల సరాఫరాపై అవగాహన కల్పించారు. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. రైతులు లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు డీలర్ నుండి రసీదు తీసుకోవాలని తెలిపారు. రసీదును పంట కాలం ముగిసే వరకు తమ వద్ద భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మిన సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని డీలర్లు, ఏఈఓలు పాల్గొన్నారు.

పద్మనాభ స్వామిని దర్శించుకున్న వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్‌రెడ్డి తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామిని శనివారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మామిడిపల్లి, మాజీ సర్పంచ్ గడ్డం మారుతిరెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

ఎలాంటి సమస్య వచ్చినా చెప్పండి

- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్
- పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకున్న సీపీ


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సిబ్బందికి గల సమస్యలను తెలుసుకోవడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం శనివారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్, ఐపియస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలు, సందేహాలు, బాగోగుల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సత్వరచర్యలకు ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బందికి ఎప్పుడు ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని తెలిపారు. సమాజంలో పోలీసుకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు డిసిపి (అడ్మిన్) కోటేశ్వర రావు, అదనపు డిసిపి (లాఅండ్‌ఆర్డర్) బస్వారెడ్డి, ఆర్మూర్, బోధన్, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్, ఆర్మ్‌డ్ రిజర్వు సిసిఎస్, సిసిఆర్‌బి, ఎసిపిలు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు ఆర్‌ఎస్‌ఐలు, ఎఆర్‌ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, హెూమ్ గార్డ్స్

కేజీబీవీలో విచారణ

- నవతెలంగాణ వార్తకు స్పందన


విచారణ చేపడుతున్న అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలకేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం జరిగిన ఘటనపై నవతెలంగాణ పత్రికలో వచ్చిన కేజీబీవీలో అమానుషం అనే వార్తకు అధికారులు స్పందించారు. ట్రైనీ ఐఎఎస్, మండల ఎంపీడీఓ ఇంఛార్జి సంకేత్ కుమార్, జిల్లా విద్యాశాఖ చైల్డ్ అధికారి భాగ్యలక్ష్మి శనివారం కస్తూర్బాలో సిబ్బందితో విచారణ చేపట్టారు. కస్తూరిభా పాఠశాలలో ఏం జరుగుతుంది, అధ్యాపకురాలి చైన్ ఎలాపోయింది.. విద్యార్థిని ఎందుకు బయటకు తీసుక వెళ్ళారు అనే అశలపై విచారణ జరిగినట్లు సమాచారం. ఈ విచారణ నివేదికను ఉన్నత అధికారులకు అందజేస్తామని తెలిపారు. వారితో పాటు మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మేఘ గర్జన సభను జయప్రదం చేయండి

- పిడిఎస్‌యు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పుట్ట వరదయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈ నెల 21న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే వసంత మేఘ గర్జన సభను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పుట్ట వరదయ్య అన్నారు. శనివారం నగరంలోని గిరిరాజ్ కళాశాలలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిడిఎస్‌యు విద్యార్థి సంఘం నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాట స్ఫూర్తితో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జార్జిరెడ్డి నాయకత్వంలో ఏర్పడిందన్నారు. శాస్త్రీయ విద్యా సాధనకోసం పోరాడుతుందని తెలిపారు. విద్యా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమించిందన్నారు. స్కాలర్ షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం పోరాడిందని తెలిపారు. సమసమాజం కోసం జరిగిన అనేక పోరాటాల్లో పిడిఎస్‌యు క్రియాశీల పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు సతీష్, జిల్లా నాయకులు మోజీరాం, మాజీ నాయకులు, టి.సాయిలు, గంగాధర్, శివరాజ్, ప్రస్తుత నాయకులు అరుణ్, మహేష్, అమర్, నరేష్, జ్యోతి, సుజాత, నవ్య, అమల, కీర్తన, వినూత్న, నోవిక, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి రాష్ట్ర సాధనలో ముందుండి జేఏసీని నడిపించిన కోదండరామ్‌కు నగరంలో టీఎన్జీవో భవన్‌లో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చైర్మన్ గోపాల శర్మ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ కన్వీనర్ గైని గంగారం, అధికార ప్రతినిధి వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన వారి ఆకాంక్షలు ఇంకా నెరవేరలేదని గుర్తు చేశారు. ఆనాడు ఏ ఒక్క పార్టీతో తెలంగాణ రాష్ట్రం సాధ్యం కాదని మేధావులు, ఉద్యమ నాయకులు చర్చించి జేఏసి ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఆ జేఏసీ వాళ్ళని ఈనాడు తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. జేఏసీ చైర్మన్ కోదండరాంకు ఎమ్మెల్సీగా నియమించిన సందర్భంగా సన్మానకార్యక్రమాన్ని నిర్వహించామనారు. మేధావులు విద్యావేత్తలు పార్టీలకు అతీతంగా నాయకులు విచ్చేసి సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ గోపాల్ శర్మ, కన్వీనర్ గైని గంగారం, అధికార ప్రతినిధి మీ ప్రభాకర్, కో కన్వీనర్ ఎఫ్సీఎల్ భాస్కర్, పీఎంపీ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్, మైనార్టీ జేఏసీ ఎస్కే నజీర్, తదితరులు పాల్గొన్నారు.

చరవాణి అప్పగింత

నవతెలంగాణ-సిరికొండ

పోగొట్టుకున్న చరవాణిని ఎస్‌ఐ రామ్ బాధితుడు తలారి గంగాధర్‌కు అందజేశారు. మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన తలారి గంగాధర్ ఇటీవల పోగొట్టుకున్న తన చరవాణిని సిఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి అప్పగించారు. ఎవరైనా తమ చరవాణి పోగొట్టుకున్న, దొంగిలించబడిన ఐయమ్‌ఈఐ నెంబర్ తో పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేస్తే పట్టుకుంటామని తెలిపారు.

వాట్సప్ స్టేటస్‌లో ఫోటోలు పెట్టొద్దు

- ఎస్సై రంజిత్ కుమార్

నవతెలంగాణ-సదాశివనగర్


మాట్లాడుతున్న ఎస్ఐ

వాట్సప్ స్టేటస్‌లో ఫోటోలను పెట్టవద్దని విద్యార్థులకు సదాశివనగర్ ఎస్సై రంజిత్ కుమార్ సూచించారు. మండలంలోని భూంపల్లి గ్రామంలో శనివారం పోలీసు కళాజాత నిర్వహించారు. కళాప్రదర్శన విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని చెప్పారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థానానికి ఎదిగి తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. బాల్య వివాహం చేయవద్దని తల్లితండ్రులకు తెలిపారు. తల్లితండ్రుల పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లోకేశ్వర్‌రావు, మురళి, ఏఎస్సై సాగర్, ఉపాధ్యాయులు, కళాబృందం ప్రభాకర్, శేషారావు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గాంధారి పోలీస్‌స్టేషన్లో ఓపెన్ హౌస్

నవతెలంగాణ-గాంధారి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధారి పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు గాంధారి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులందరికీ అవగాహన కల్పించారు. పోలీస్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో తెలియజేయడంతోపాటు పోలీస్ స్టేషన్లో గల ఆయుధాలు, ఆయుధాల వాడకం, ఆయుధాల పనితీరుపై ఎస్సై ఆంజనేయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కదిలిన జిల్లా అటవీ శాఖ యంత్రాంగం

- గౌరారం గ్రామ అటవీ భూములను సందర్శించిన జిల్లా అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గౌరారం గ్రామ అటవీ శివారు భూమిని వేరే గ్రామానికి చెందిన వ్యక్తులు కబ్జా చేశారని గౌరారం గ్రామస్తులు మండలస్థాయి అటవీ అధికారులు మొదలుకొని రాష్ట్రస్థాయి అటవీ అధికారుల వరకు వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలతో అటవీశాఖ జిల్లా యంత్రాంగంలో కదలిక వచ్చింది. శనివారం జిల్లా అటవీ శాఖ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో డివిజన్, మండలస్థాయి అటవీ అధికారులు గ్రామస్తులతో కలిసి గౌరారం గ్రామానికి చెందిన అటవీ శాఖ భూమి సుమారు 70 ఎకరాల వరకు భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ.. పది రోజుల్లోగా గ్రామ అటవీ భూమి సమస్యను పరిష్కరిస్తామని అటవీ శాఖ జిల్లా అధికారి రామకృష్ణ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.


మాట్లాడుతున్న పోలీసులు, పలువురు

దేశాయ్‌పేట్‌లో మద్య నిషేధానికి తీర్మానం

- మద్యాన్ని అమ్మితే రూ.50వేల జరిమానా

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)


సభలో పాల్గొన్న గ్రామస్తులు

మద్యాన్ని నిషేధించి తమ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా నిలపాలని తపన పడుతున్న ఆ గ్రామస్థులంతా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా తమ గ్రామంలో మద్యం విక్రయించినా, మద్యం తాగినా రూ.50 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందంటూ అందరూ కలిసి ఏకగ్రీవ తీర్మానం చేశారు. బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలో శనివారం ఉదయం గ్రామపెద్దలు, యువకులు గ్రామ మహా సభ నిర్వహించారు. ఈ సభలో గ్రామంలో మద్యం నిషేధిస్తున్నట్టు తీర్మాణం చేశారు. మద్య నిషేధం చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దేశాయిపేట్ గ్రామంలో మద్యం అమ్మవద్దని, మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ గ్రామస్థులందరూ మూకుమ్మడిగా తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని గ్రామస్థులందరి ముందు ఆవిష్కరించారు.

సైబర్ క్రైమ్స్‌తో జాగ్రత్తగా ఉండండి

- నాగిరెడ్డిపేట్ ఏఎస్ఐ ఉమేష్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ క్రైమ్స్‌తో రైతులు జాగ్రత్తగా ఉండాలని నాగిరెడ్డిపేట్ ఏఎస్ఐ ఉమేష్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ప్రస్తుతం రైతులు ధాన్యం విక్రయిస్తున్న నేపథ్యంలో రైతులకు సైబర్ నెరగాళ్లు రకరకాలుగా ఫోన్లు చేసి రైతుల ధాన్యం డబ్బులను కాజేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఫోన్‌లో ఎవరూ ఏ ఓటీపీ అడిగినా చెప్పొద్దని ఆయన రైతులకు వివరించారు. సైబర్ నేరగాళ్లు రకరకాలుగా ఫోన్లు చేసి రకరకాల మెసేజ్‌లు పంపిస్తారని, మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది శ్రీనివాస్, రాజు అన్నారు.

రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్


రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-మద్నూర్

ఇతర రాష్ట్రాలలో పండించిన వరి ధాన్యం మహరాష్ట్ర వైపు నుంచి తెలంగాణలోకి రాకుండా అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం (సలాబత్‌పూర్) వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక (బృందం) తనిఖీ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ప్రతి గూడ్స్ లారీ, డిసిఎం వ్యానులను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని తెలియజేశారు. తనిఖీల సందర్భంగా రికార్డ్ చేస్తున్న రిజిస్టర్‌ను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో సన్న వడ్లకు బోనస్ రూ.500 రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నందున ఇతర రాష్ట్రాలలో పండించిన వరి ధాన్యం తెలంగాణలోకి రాకుండా కట్టడి చేయడానికి ఈ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు డిసియస్ నరసింహరావు, డిఎం రాజేందర్, మద్నూర్ తహసీల్దార్ ఎండి ముజీబ్, సివిల్ సప్లయ్ నయాబ్ తహసీల్దార్ ఖాలిద్, మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ సిఐకి ఘన సన్మానం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ రూరల్ సిఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సిఐ రాజేష్‌కు నసురుల్లాబాద్ మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన బాన్సువాడ రూరల్ సిఐ రాజేష్‌కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చంతో పాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, మాజీ ఎంపీటీసీ ఫోరం కన్వీనర్ కంది మల్లేష్, సీనియర్ నాయకులు రాము, ప్రతాప్ సింగ్, ఇక్బాల్, సాయిలు యాదవ్ తదితరులున్నారు.

జీపీ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న నాయకుని ఆగడాలను అడ్డుకోండి

- ఎంపీడీవోకు గ్రామస్తులు వినతిపత్రం


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని మొండిసడక్ గ్రామ పంచాయతీకి చెందిన ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని గ్రామస్తులు ఎంపీడీవోకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండలంలోని మొండిసడక్ గ్రామపంచాయతీ పరిధిలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో గ్రామ పంచాయతీకి చెందిన ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి అధికార పార్టీ కార్యకర్త దేమే కృష్ణగౌడ్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఈ కబ్జాని అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని ఉమ్మడి ముదెల్లి గ్రామ పంచాయతీ తరపున ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశామని గ్రామస్తులు తెలిపారు.

50 ఏళ్ల విద్యార్థి ఉద్యమ ప్రస్థానంలో తిరుగులేది

నవతెలంగాణ-బోధన్



మాట్లాడుతున్న సంఘం రాష్ట్రనాయకులు

విద్యార్థుల హక్కుల సాధనకై ఉద్యమించిన పీడీఎస్‌యూ తన 50 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో విజయాలు సాధించిందని పౌర హక్కుల సంఘం రాష్ట్రనాయకులు సంఘం అన్నారు. అలాగే విద్యార్థుల ఉద్యమాలకు ప్రధాన గొంతుక పీడీఎస్‌యూ అని పేర్కొన్నారు. శనివారం బోధన్ పట్టణంలో పీఆర్టీయూ భవన్‌లో పిడిఎస్‌యు అర్ధశతాబ్ది ఉత్సవ సభల సందర్భంగా లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించాలని, శాస్త్రీయ విద్యా కావాలని ఈ రాష్ట్రంలో 50 వసంతాల నుంచి పిడిఎస్‌యు ఉద్యమిస్తూ విద్యార్థి పోరాటాల గొంతుకగా నిలిచిందన్నారు. పీడీఎస్‌యూ జెండాను నిలబెట్టడం కోసం అనేకమంది విప్లవ విద్యార్థులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుండి పోరాడారని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అలాగే దేశంలో విద్యా వ్యాపారీకరణ, కార్పోరేటీకరణ, కాషాయకరణ వైపు మార్చేలా పాలకులు అడుగులేస్తున్నారని దీనిని అరికట్టకపోతే విద్య అందని ద్రాక్షలాగా మారుతుందని అన్నారు. అనేక ప్రభుత్వ విద్యా సంస్థలను ఉద్దేశపూర్వకంగానే నీరుగార్చి మూసివేసి విద్యకు దూరం చేయడం ఇంతకన్నా దుర్మార్గం మరొకటి లేదన్నారు. అమరుల స్ఫూర్తితో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. అసమానతలు లేని సమాజం కోసం పీడీఎస్‌యూ ముందుండి పోరాడుతుందన్నారు. ఒకరి నుంచి మరొకరు దోచుకునే దోపిడీ వ్యవస్థ నిర్మూలించాలని, కామన్ విద్యా విధానం అమలు చేయాలని కోరుతూ నిరంతరం పోరాటం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు ఎవరు అధికారంలోకి వచ్చినా.. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మాణం అవుతుందని దీనిని గమనించకుండా విద్యార్థి వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న పాలకవర్గాలపై మరింత ముందుండి పోరాడాలని వారు అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆర్.గౌతమ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ కార్తీక్, జిల్లా నాయకులు సాయినాథ్, పూర్వ నాయకులు సుధాకర్, అరుణ్, పోశెట్టి, భీంరావ్, సాయిబాబా, అమూల్య, అంబిక, స్వప్న, సంయుక్త, హర్షిని, రవి, రాజకుమార్, ప్రకాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన చైర్మన్‌ను సన్మానించిన క్రైస్తవ, మైనార్టీ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పురపాలక సంఘం నూతన చైర్మన్‌గా ఇటీవల ఎన్నికై పదవి బాధ్యతలు చేపట్టిన పద్మ శ్రీకాంత్‌ను శనివారం మున్సిపల్ కార్యాలయంలో మైనార్టీ నాయకులు, మాజీ జెడ్పిటిసి గయాజుద్దీన్, క్రిస్టియన్ నాయకులు జాన్ భాస్కర్ ఆధ్వర్యంలో వేరువేరుగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. మున్సిపల్ ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ ఎల్లారెడ్డి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని, అన్ని వర్గాల ప్రజల ఆదరణ అభిమానాలతో గొప్ప పాలకులుగా ఖ్యాతితో మరింత ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ నీలకంఠం, క్రైస్తవలు సాయిబాబా, సాయిలు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రానికి చెందిన వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ప్రమాదంలో గాయపడి వివిధ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా బాధితులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘని బాబా, లైన్ రమేష్, బొమ్మని బాలయ్య, నీళ్ల రవి, సంఘని బాలయ్య, గడ శంకర్, హైమద్, అల్తాఫ్, రామకృష్ణ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డి, పోసానిపేట్ గ్రామాల్లో శనివారం వరి కొనుగోలు కేంద్రాలను అడ్లూరు ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని, ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పశుపతి, సీఈఓ బైరయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మా గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

- మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-పిట్లం



వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నడిమింటి లాలయ్య (57) ఈనెల 11న మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రానందున తన కొడుకు నడిమింటి బాబు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేస్ నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా లాలయ్య మండల కేంద్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా సేవలు అందించేవారని ఆయన పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ శిరీష, ఫైనాన్షియల్ లిట్రసీ సౌందర్య తెలియజేశారు. శనివారం మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్త్రీలకు సంబంధించిన చట్టాలను వివరించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, హెల్ప్‌లైన్ నెంబర్లు విద్యార్థులకు తెలియజేశారు. అలాగే ఆడపిల్లలు ధైర్యంగా ముందుకెళ్లాలని ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.

పిట్లం ఉపాధి హామీ ఏపివోగా మహేష్

నవతెలంగాణ-పిట్లం



మండల ఉపాధి హామీ నూతన ఏపీవోగా మహేష్ పదవి బాధ్యతలు స్వీకరించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కమలాకర్ తెలిపారు. ఈ యన గాంధారి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ ఏపీవోగా విధు లు నిర్వర్తిస్తూ బదిలీపై రాగా.. పిట్లం ఇంచార్జ్ ఏపీఓగా విధులు నిర్వర్తించిన శివకుమార్ నిజాంసాగర్ మండలానికి బదిలీపై వెళ్లినట్లు ఆయన తెలిపారు.

పీహెచ్‌సీ సబ్ సెంటర్ పరిశీలన


పీహెచ్‌సీ పనులను పరిశీలిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భిక్కనూర్ బి, రామేశ్వర్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న సబ్ సెంటర్ల నిర్మాణాన్ని పీహెచ్‌సీ వైద్యులు దివ్య శనివారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని కాంట్రాక్టర్లకు తెలియజేశారు. ఈ పరిశీలనలో హెచ్‌ఈఓ వెంకటరమణ తదితరులున్నారు.

కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠాపన మహెూత్సవం

- హాజరైన మాజీ ఎమ్మెల్యే దంపతులు


విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని మేడిపల్లి గ్రామంలో కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహెూత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సతీసమేతంగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. గోమాతకు, విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం స్వామివారి విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలించిన ఏవో

నవతెలంగాణ-భిక్కనూర్


పంటను పరిశీలిస్తున్న ఏవో

పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి రాధా శనివారం పరిశీలించారు. పంటలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ వరిలో మెడ విరుపు తెగులుకు ఐసీ ప్రోతిలిన్ 1.5 ఎంఎల్/లీటర్ లేదా ఆక్సీస్ట్రోబిన్, ట్రై సైక్లోజోల్ మిశ్రమాన్ని 1 ఎంఎల్/లీటర్ కలిపి పిచికారీ చేసుకోవాలని 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు వేసుకున్నట్లయితే నివారించవచ్చని రైతులకు సూచించారు. ఈ పంట పరిశీలనలో ఏఈఓ వినోద్, రైతులు తదితరులున్నారు.

రైతు భరోసా అమలు చేయాలి

- కాంగ్రెస్ పనితీరుపై నేడు బీఆర్ఎస్ నిరసన

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

రైతులను ఆదుకోవడానికి రైతు భరోసా అమలు, రుణమాఫీ వంటి చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ నేతలు ఆదివారం బాన్సువాడ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు బాన్సువాడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నేత జుబేర్ తెలిపారు. శనివారం బాన్సువాడ పట్టణంలో బిఆర్ఎస్ నేత జుబేర్ మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాలం రైతు భరోసా ఇప్పటికీ ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిరసనగా ఆదివారం బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ప్రతి ఎకరానికి 15 వేల చొప్పున భరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు రైతులను మోసం చేశారని దీనికి నిరసనగా అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు బీఆర్ఎస్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

నవతెలంగాణ-మద్నూర్

విత్తన శుద్ధితో తెగుళ్లను నివారించవచ్చనని ఏవో రాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శనగ విత్తనాలను పంపిణీ చేసి వాటితో పాటు తెగుళ్ల నివారణ పౌడర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజు మాట్లాడుతూ ఎన్ఎస్‌సి ఆధ్వర్యంలో రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. రైతులు పండించే శనగ పంటకు తెగుళ్ల నివారణ కోసం విత్తన శుద్ధి పౌడర్ పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. శనగ విత్తనాల కొనుగోళ్ళతో పాటు అవసరమున్న రైతులు విత్తన శుద్ధి పౌడర్‌ను తీసుకువెళ్లవచ్చని తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ చాట్ల గోపాల్, ఏవో రాజు, సంఘం సభ్యులు, సంఘం పరిధిలోని వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

కాకతీయ విద్యాసంస్థల అధినేత రజనీకాంత్‌కు సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


రజనీకాంత్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ కాకతీయ విద్యాసంస్థల అధినేత సిహెచ్ రజనీకాంత్‌ను జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం సన్మానించారు. నిజామాబాద్ జిల్లాలో అనాథ(మానవత సదన్) పిల్లలను ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన కాకతీయలో ఉచితంగా విద్యాబోధన చేస్తున్నందుకు గాను సన్మానించారు. కాకతీయ విద్యాసంస్థల అధినేత రజినీకాంత్ తో పాటు ప్రిన్సిపాల్ రణదీశ్ ను సన్మానించారు. సన్మానించిన వారిలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక వైఖరిని ప్రశ్నిద్దాం

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక వైఖరిని ప్రశ్నిద్దాం అని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) రాష్ట్ర కార్యదర్శి ఎం. ముత్తెన్న అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, నాయకులు రమేష్ మాట్లాడుతూ నేడు హైదరాబాద్‌లో జరిగే విలీన మహాసభను విజయవంతం చేయాలని అన్నారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా విధానలు వేగంగా అమలు చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు జీవితాలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారని, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి బలమైన కార్మిక ఉద్యమం నిర్మాణం అవసరమని అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వీలిన సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు జిల్లాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రాజేశ్వర్, సత్తెక్క, ఎండి,నజీర్, మనోజ్, తూర్పాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి టీ హబ్‌లో షార్ట్ సర్క్యూట్

- తప్పిన పెనుప్రమాదం

నవతెలంగాణ-కంఠేశ్వర్


కాలిపోయిన వైర్స్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో గల టీ హబ్‌లో షార్ట్ సర్క్యూట్ ఘటన శనివారం చోటుచేసుకుంది. టీ హబ్ కార్యాలయంలో ఉన్న ఏసీకి గల వైర్లు ఒకదానికి ఒకటి తగిలి ప్రమాదం సంభవించినట్టు సమాచారం. కాగా ఇదే కారణమా..? లేకుంటే ఇంకేదైనా ప్రమాదంతో సంభవించిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగి ఉంటే టీ హబ్ లో జరిగే డయాగ్నస్టిక్ పరీక్షలు ఏ విధంగా నిర్వహించేవారు వారికే తెలియాలి. అనుకోకుండా జరిగే ప్రమాదాలు ఎప్పుడు అవుతాయి ఎలా అవుతాయి ఎవరికి తెలియదు కానీ కొద్దిగా అయినా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ అక్కడున్న సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్వయంగా వెళ్లి షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి అడిగినా పట్టించుకునే నాధుడే కరువయ్యారు.

జీవో 29ని సడలించాలి

- మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29ని సడలించాలని నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనకు బీజేపీ మద్దతు ఇస్తుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. తమ పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్టైందని ప్రజలు భావిస్తున్నారని, పింఛన్లు పెంచడం అటుంచితే ఉన్న పింఛన్లను ఎత్తేస్తున్నారని అన్నారు. దేవుళ్ల మీద ఒట్లేసి గట్టుమీద పెట్టేశారని విమర్శించారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సెటిల్మెంట్లు చేసే పరిస్థితి లేదన్నారు. రైతులను ఆగం చేశారని, ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించే స్థితిలో రేవంత్ ప్రభుత్వం లేదన్నారు. మూసీ బాధితుల పక్షాన నిలుస్తామని, త్వరలోనే ఉద్యమ ప్రకటిస్తామన్నారు.

యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మానాల

నవతెలంగాణ కంఠేశ్వర్

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ శనివారం యాదగిరి లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

- ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, దీనిగురించి తమ తల్లిదండ్రులకు తెలపాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇందల్‌వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ కీటక జనత వ్యాధులపై అవగాహన, ఉచిత ఆరోగ్య శిబిరం, ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ పాల్గొని మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికున్ గునియా లాంటి వ్యాధులను కలుగజేసే దోమలను, వాటి లార్వాలను నివారించాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థులకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. విద్యార్థులందరికీ రక్త పరీక్ష నిర్వహించి బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేశారు. కొంతమంది పిల్లలకు ఆర్డిటి పరీక్ష ద్వారా డెంగ్యూ, మలేరియా పరీక్షలు నిర్వహించారు. డెంగీ వ్యాధిని ---వచ్చే దోమ మంచినీటిలో నివసిస్తుందని, మంచినీరు ఎక్కువ కాలం నిలువ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అలాంటి నీటిలో లార్వ అధికంగా ఉంటుందని, తద్వారా ఏడు రోజుల తర్వాత దోమగా పెరుగుతుందని, నీటి నిలువగల ప్రాంతాలను గుర్తించి వాటిని పూడ్చే విధంగా చూడాలని విద్యార్థులకు సూచించారు. సెప్టిక్ ట్యాంకులపై మూతలు సక్రమంగా ఉండే విధంగా చూడాలని లేనట్లయితే జాలీలు బిగించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల మలేరియా వ్యాధి సంక్రమిస్తుందని క్యూలెక్స్ దోమ వలన ఫైలేరియా వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. ఫైలేరియా వల్ల తీవ్రమైన జ్వరం, కాళు వాపు లాంటివి వస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉన్నట్లయితే గ్రామమంతా పరిశుభ్రంగా ఉంటుందని, అందరూ ఆరోగ్యంగా ఉంటానని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రాధిక, ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, ఆశా కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు లక్ష్మి నాథం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్


ఆర్మూర్‌లో..


బాల్కొండలో...

రైతు భరోసాను ఎగ్గొట్టడం మోసమే

- తుమ్మల చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం
- వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు వేయాల్సిందేనని డిమాండ్
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి: వానాకాలం రైతు భరోసాను ఎగగొట్టటం రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమేనని స్థానిక బిఆర్ఎస్ నాయకులు అన్నారు.వర్షాకాలానికి రైతు భరోసా పోయినట్లేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనపై బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతుల ఖాతాలో ఎకరానికి రూ. 7వేల 5 వందల చొప్పున రైతు భరోసా వేయాల్సిందేనని డిమాండ్ చేశారు.శనివారం మండల కేంద్రంలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా(హాస కొత్తూర్) వద్ద రైతు భరోసా పై మంత్రి తుమ్మల వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.... కాంగ్రెస్ గెలిస్తే రైతు బంధుకు రాంరాం చెబుతున్నారన్న కేసీఆర్ మాటలను రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసిందన్నారు. వానాకాలం పంట సీజన్ కు రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టేసి కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టిందన్నారు. రేపు, మాపు అంటూ నెట్టుకొస్తున్నప్పుడే ఈ ప్రభుత్వం మీద అనుమానం కలిగిందని, ఇప్పుడు స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతులేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ప్రభుత్వం చేతగానీ తనంతో రైతన్నలను మోసం చేస్తామంటే ఊరుకునేలేదని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. సబ్ కమిటీ, గైడ్ లైన్స్ అంటూ పెట్టుబడి సాయాన్ని ఎగ్గొడతామంటే రైతులు వీపు చింతపండు చేస్తారన్నారు.ఎద్దు ఏడ్చినా ఏవుసం, రైతు ఏడ్చినా రాజ్యం బాగుపడదంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విధాలుగా రైతును ఏడిపిస్తున్న కాంగ్రెస్ కు రైతుల ఉసురు తప్పదన్నారు.రైతు భరోసాకు డబ్బులు లేకపోవటంతోనే సబ్ కమిటీ అంటూ డ్రామాలు స్టార్ట్ చేశారని, కేసీఆర్ పదివేలు ముష్టి వేస్తున్నాడు...మేము రూ.15 వేలు ఇస్తామన్న సిపాయి ఎక్కడ? అని ప్రశ్నించారు. పేదల కడుపు కొట్టి రూ.లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణకు డబ్బులుంటాయా? ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎకరానికి రూ.7500 ఇచ్చేందుకు పైసలు లేవా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.పచ్చి అబద్దాలు, మోసాలతో అధికారంలోకి వచ్చేందుకు రేవంత్ రెడ్డి రైతులను దగా చేశాడన్నారు.నీ దగాకోరు మాటలు నమ్మి గెలిపించిన రైతులను అరిగోస పెడుతున్నావని, రైతులతో చెలగాటమాడితే మాడి మసి అవక తప్పదని హెచ్చరించారు.రుణమాఫీ మోసం చాలదన్నట్టు... ఇప్పుడు రైతు భరోసాలోనూ దగానే అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని, లేదంటే ఎక్కడికక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలేది లేదన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, రైతు విభాగం మండల అధ్యక్షుడు బద్దం రాజశేఖర్, యూత్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రఘు, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొంటి కంటి నరేందర్, నాయకులు సుంకర మురళి, సంత రాజేశ్వర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, నోముల నరేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి(వేల్పూర్) :రైతులతో పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నాగధర్ రెడ్డి అన్నారు. ఈ సీజన్ కి రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలకు నిరసనగా వేల్పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగధర్ రెడ్డి మాట్లాడుతూ గత సీజన్ రైతుభరోసా కూడా రేపు మాపు అంటూ ఇవ్వలేదని, ఈ సీజన్ రైతు భరోసా కూడా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడటం రైతులను నమ్మించి మోసం చేసినట్లేనని అన్నారు. పంట వేయడానికి పెట్టుబడి పెట్టాలంటే మళ్ళీ వ్యాపారస్థుల దగ్గర వడ్డీకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రుణమాఫీ లేదు, కరెంట్ సక్రమంగా ఇవ్వటం లేదు, ఇప్పుడు పంట పెట్టుబడి ఎగ్గొట్టారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, సొసైటీ చైర్మన్లు మోహన్ రెడ్డి, రాజేశ్వర్, పడగల్ హన్మంతు రెడ్డి, యాల్ల శ్రీను, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నీరడి భాగ్య, నోముల రవీందర్, డొల్ల రాజేశ్వర్, బబ్బూర్ ప్రతాప్ రెడ్డి, పిట్ల సత్యం, మాజీ సర్పంచ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ లో రైతు భరోసా ఇవ్వడం కుదరదని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావ్ ప్రకటించడంతో తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశామని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇవ్వాలని, లేకుంటే ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షులు జైనోద్దీన్, యూత్ విభాగం అధ్యక్షులు మారు నరేష్, గ్రామశాఖ అధ్యక్షులు దేవుడు నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండ :వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వడం కుదరదని చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బాల్కొండ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్ :జాతీయ రహదారి 63పై బస్టాండ్ సమీపంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు ఖరీఫ్ సీజన్లో రైతులకు రైతుబంధు డబ్బులు ఇవ్వలేమని చెప్పడంతో రైతులను నట్టేట ముంచడమేనని అన్నారు. తక్షణమే ప్రభుత్వం తమ తీరును మార్చుకొని రైతు బంధు డబ్బులను రైతు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. రుణమాఫీని సైతం సక్రమంగా చేయని ప్రభుత్వం రైతుబంధు డబ్బులు కూడా రైతులకు ఇవ్వకుండా మోసం చేస్తుందని అన్నారు. తక్షణమే రైతుబంధు, రుణమాఫీ డబ్బులను రైతు ఖాతాలలో జమ చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలియా డిమాండ్ చేశారు.

ఆర్మూర్ :వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా వేయాల్సిందేనని నియోజకవర్గ ఇన్చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం చెబుతున్నారన్న కేసీఆర్ మాటలను రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసిందని అన్నారు. వానాకాలం పంట సీజన్‌కు రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టేసిందని, లక్షలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టిందని అన్నారు. స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతులెత్తేస్తున్నట్లు ప్రకటించి రైతన్నలను మోసం చేస్తామంటే ఊరుకునేదేలేదన్నారు. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణకు డబ్బులుంటాయి కానీ రైతులకు ఎకరానికి రూ. 7500 ఇచ్చేందుకు పైసలు లేవా.. అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని లేదంటే ఎక్కడికక్కడ మీ ప్రజాప్రతినిధులను ముట్టడిస్తామని అన్నారు. రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చే వరకు కాంగ్రెస్‌ను వదిలేది లేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మెట్టు సంతోష్, పిప్రి మాజీ ఎంపీటీసీ సురేష్, మాజీ సర్పంచులు బంటు దయానంద్, బుగ్గొల్ల ప్రదీప్, సీనియర్ పోల సుధాకర్, ఈగ గంగాధర్, మీర శ్రావణ్, డిపూల్ (కిరణ్), నుత్పెల్లి రాజేందర్ రెడ్డి, మండల అనిల్, యూత్ అధ్యక్షులు గుంజాల పృథ్వీరాజ్, మండల యువజన విభాగం అధ్యక్షులు అగ్గు క్రాంతి, పిప్రీ, గోవిందపేట్, గగ్గుపల్లి, రాంపూర్, ఆలూర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో..


మోర్తాడ్‌లో..


ఏర్గట్లలో..

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- పదేళ్లుపాలించిన బీఆర్ఎస్, బిజెపి రైతులకు ఏంచేశారు?
- రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, పదేళ్లుగా పాలించిన బీఆర్ఎస్, బిజెపి రైతులకు ఏంచేశారని, నల్ల చట్టాలు తీసుకుని వచ్చి వందలాది మందికి మరణానికి కారణమైన బిజెపి, దేశ రైతులకు క్షమాపణ చెప్పింది చాలక నేడు ధర్నా చౌక్‌లో ధర్నాలు చేయడం సిగ్గుచేటని అన్నారు.

బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు రైతులను, ప్రజలను రెచ్చగొట్టడం ఒక్కటే తెలుసని, అధికారం పోయిన వెంటనే మతిస్థిమితం కోల్పోయి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని, వారి ఉచ్చులో పడొద్దని సూచించారు. బిజెపి దేశంలోని 15 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న అక్కడ ఉన్న రైతులకు ఒక్క రూపాయి బోనస్సే కాకుండా ఒక రూపాయి రుణమాఫీ సైతం చేయలేదని అన్నారు. ఇక్కడ బిజెపి నాయకులు రైతుల పేర రాజకీయాలు చేస్తూ ధర్నాలు చేయడం సిగ్గుచేటైన విషయ మన్నారు. వారికి రైతుల గురించి మాట్లాడే హక్కు లేదని ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి సహకార సొసైటీ అద్వర్యంలో చంద్రయాన్ పల్లి లో, రాంపూర్ డి సహకార సొసైటీ అద్వర్యంలో బీబీ పూర్ తండా వద్ద, ఖిల్లా డిచ్ పల్లి సహకార సొసైటీ అద్వర్యంలో ఖిల్లా డిచ్ పల్లి లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఐ డి సి ఎం ఎస్ చైర్మన్ నాయక్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి సహకార సొసైటీ చైర్మన్ ల చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, రామచంద్ర గౌడ్ లతో కలిసి కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని కులాలకు చెందిన విద్యార్థులను ఏకతాటిపైకి తీసుకువచ్చి నాణ్యమైన ఇంగ్లీష్ బోధన చేయడానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నెలకొల్పుతుందని తెలిపారు. మండలంలోని సుద్దులం గ్రామంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్‌ను అందజేయడంతో రికార్డుస్థాయిలో వరి ధాన్యం పండినట్లు ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొందాలని, మధ్య దళారులను ఆశ్రయించవద్దని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఎక్కువ డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసుకుంటున్నవారికి అమ్ముకొని లబ్ది పొందాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి కోరారు. హామీ ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశామని, వచ్చే డిసెంబర్ కల్లా రెండు లక్షల పైన ఉన్న వారందరికీ మాఫీ అవుతుందని, దీనిలో ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. క్వింటాలుకు ఏ గ్రేడ్ కు 2,320, బి గ్రేడ్ 2300 మద్దతు ధరను ప్రకటించిందని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద రెండు కాంటలను ఏర్పాటు చేస్తామని సన్న వడ్లకు ప్రభుత్వం 500 బోనస్ను ప్రకటించిందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట వైస్ చైర్మన్ కుమ్మరి చిన్న గంగారం, మారుతి, డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి ఆనంద్, న్యాస రాజేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, కూరపాటి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, పొలసాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజన్న, కరుణ, బాల్ రామ్ నాయక్, ఎల్ఐసి గంగాధర్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తహసిల్దార్ వెంకట్ రావు, ఎంపిడిఓ లక్ష్మారెడ్డి, ఆర్ఐ మోహన్, వ్యవసాయ అధికారులు సుధా మాధురి, శ్రీ కాంత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహిళపై సామూహిక లైంగిక దాడి

- పోలీసుల అదుపులో నలుగురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళపై సామూహిక లౌంగిరదాడి జరిగిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. కాగా నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి సమయంలో నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మహిళ(38)ను ముగ్గురు యువకులు డిచ్‌పల్లి వైపు తీసుకెళ్లారు. అనంతరం మరో యువకుడితో కలిసి నలుగురు సామూహిక లైంగిక పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చెయ్యాలి

- ఎస్సీ 57 ఎంబీఎస్‌సీ కులాల రాష్ట్ర అధ్యక్షులు నిరగొండ బుచ్చన్న

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 21న సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో తలపెట్టిన ఎస్సి 57 ఉపకులాల నిరసన దీక్ష పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎస్సి ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నిరగొండ బుచ్చన్న పిలుపునిచ్చారు. నిజామాబాద్ పట్టణంలో గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాజేష్ ఏర్పాటు చేసిన "చలో హైదరాబాద్" నిరసన దీక్ష కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం రేవంత్ రెడ్డి ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈమేరకు త్వరగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సి వర్గీకరణలో వెనుకబడ్డ ఉపకులాలను మాల, మాదిగ కులాలతో కలపకుండా ఎస్సి-ఏ గ్రూపులో చేర్చి 7శాతంరిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. 2011జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ అమలు చేయకుండా ఎస్సి కుల సర్వే చేపట్టి వర్గీకరణ చేయాలని తెలిపారు. ఈ డిమాండ్లతో నిరసన దీక్ష చేపడుతున్నట్టు చెప్పారు. దీనికి జిల్లాలో ఉన్న ఉపకులాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోసంగి సీనియర్ నాయకులు కర్రె లింగస్వామి, గంధం గంగాధర్, పస్తం రాజన్న, రాజు, దళిత నాయకులు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | అక్టోబర్ 20, 2024 | www.navatelangana.com

విగ్రహాల చోరీ రికవరీ చేయండి

- డీఎస్పీకి వినతిపత్రం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని మేనూర్ గ్రామ శివారు పరిధిలోగల అయ్యప్ప సన్నిధి నుంచి చోరీకి గురైన విగ్రహాలను రికవరీ చేయాలని అయ్యప్ప సేవా సమితి గురు స్వాములు తెపారు. శనివారం డీఎస్పీ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి గురు స్వాములు హన్మాండ్లు స్వామి, డిష్ రాజు, కృష్ణ పటేల్, నాందేవ్, రమేష్, పింకు, దత్తు, తదితరులు ఉన్నారు.

తూతూ మంత్రంగా కొనుగోలు కేంద్రాలు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారభించినప్పటికి, వరి ధాన్యం కొనడం లేదు. రైతులు సహకార సంఘం కొనుగోలు కేంద్రానికి వెళ్లగా.. కొనుగోల్లు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉన్నా, భారీవర్షం పడేసరికి, రైతుల గుండెల్లో గుబులు పుట్టింది. సొసైటీ సిబ్బంది త్వరగా స్పందించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



వృథాగా పడివున్న ధాన్యం కొలిచే యంత్రాలు

రైతులను మోసం చేస్తే కేసులు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు
- రెండు సొసైటీల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మోసం చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని తాండూర్, మాల్‌తుమ్మెద సొసైటీల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు అనుకూలమైన కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి మోసాలు చేసినా, అవకతవకలకు పాల్పడినా.. వారిపై కేసులు నమోదు చేయిస్తానని ఆయన పేర్కొన్నారు. గతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేదని వివరించారు. ప్రస్తుతం వెనువెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని తూకం వేయించి రైతులకు అండగా ఉంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఏ గ్రేడ్ వరి ధాన్యం రూ.2320 చెల్లించి కొనుగోలు చేస్తున్నామని ఆయన అన్నారు. అదేవిధంగా నాగిరెడ్డిపేట్ మండల వ్యాప్తంగా 44,574 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లక్ష్యంగా పెట్టుకొని కొనుగోలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కేంద్రాల వద్దనే ధాన్యాన్ని విక్రయించాలని ఆయన తెలిపారు. గతంలో ధాన్యం బస్తాలతో పాటు రెండు కిలోల తరుగు తీసేవారని.. ప్రస్తుతం ఎలాంటి తరుగు తీయకుండానే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మదన్మోహన్‌రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో తాండూరు సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, మాల్ తుమ్మెద సొసైటీ చైర్మన్ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు



నాగిరెడ్డిపేట్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామచంద్రారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇమామ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరాంగౌడ్, మాజీ సర్పంచ్ విట్టల్‌రెడ్డి, లక్ష్మణ్, ఠాగూర్, గులాం హుస్సేన్, దివిటీ కిష్టయ్య, షాహిద్ పాషా, మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి, డైరెక్టర్లు సిద్దయ్య, రవీందర్‌రెడ్డి, నగేష్, వంశీగౌడ్, నాయకులు కిచ్చయ్యగారి రాజిరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 8 లక్షల మంజూరు..

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.8 లక్షల రూపాయలతో ఫర్నిచర్ మంజూరు చేసినట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు స్పష్టం చేశారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంజూరు చేసిన ఫర్నిచర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎస్‌డిఎఫ్ నిధుల ద్వారా కళాశాలకు ఫర్నిచర్ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. అధ్యాపకుల కొరత ఉన్నందున ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ సలాంతో ఫోన్లో మాట్లాడారు. నాగిరెడ్డిపేట్ జూనియర్ కళాశాలకు గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులను నియమించే విధంగా చూడాలని ఆదేశించారు. అధ్యాపకులు లేకపోవడంతో 94 మంది ఉన్న విద్యార్థులు 54 మందిగా ప్రస్తుతం ఉన్నారని ఆయన అన్నారు. విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలన్నీ తాను కల్పిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మాజీ సర్పంచ్ విట్టల్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇమామ్, షాహిద్ పాషా ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు..

కామారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ ఉపాధ్యక్షుడు గంపల వెంకయ్య ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజా కార్యక్రమాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయనతోపాటు చీనూర్ గ్రామానికి చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, సీనియర్ నాయకులు రామచంద్రరెడ్డి, విఠల్‌రెడ్డి, కృష్ణ తదితరులున్నారు.

అంబులెన్స్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి..

మండలానికి అంబులెన్స్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా రైతులకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు సైతం అందజేయాలని ఆయన కోరారు.

కస్తూర్బా పాఠశాలలో నూతన అదనపు గదులకు శంకుస్థాపన..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నిర్మించబోయే నూతన అదనపు గదులకు శనివారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శంకుస్థాపన చేశారు. 3 కోట్ల 25 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టబోయే నూతన అదనపు గదులను నాణ్యత ప్రమాణాలతో నిర్మించి విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్లు నీలకంఠం, అల్లం శీను, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, స్థానిక నాయకులు ప్రశాంత్ గౌడ్, గయాసుద్దీన్, గోపికృష్ణ, పోచయ్య, తిరుపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి : అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గుర్తుతెలియని యువతి శవం లభ్యం

నవతెలంగాణ-ఎడపల్లి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మండల కేంద్ర పరిధిలోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన గల పెద్ద వాగు కాల్వలో ఓ గుర్తు తెలియని యువతి శవం లభ్యమైనట్టు ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అటుగా వెళ్లిన వ్యక్తులు మృతదేహం కనిపించడంతో పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చారు. ఆయన వెళ్లి పరిశీలించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గుర్తుపట్టడానికి వీలు లేకుండా మృతదేహం ఉండటంతో.. 30 రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లింగంపేట్



జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన దొడ్లే దస్‌గౌడ్ (53) ఆరు సంవత్సరాల క్రితం చాతి నొప్పితో బాధపడగా హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చూయించుకున్నాడు. గుండెకు స్టంట్ వేశారు. అలా రెండుసార్లు స్టంట్స్ వేశారు. దాస్‌గౌడ్ తన కొడుకు, కూతురుతో పాటు హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నెల 17న హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులకు ఎవరికి చెప్పకుండా లింగంపేట్‌కు వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడు చాతినొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని చనిపోయాడని మృతిని కొడుకు విశాల్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెడువ్యసనాలకు బానిసై ఒకరు ఆత్మహత్య

నవతెలంగాణ-లింగంపేట్



మండల కేంద్రానికి చెందిన జీనుగారి రాజు (46) చెడు వ్యసనాలకు బానిసై అప్పులపాలై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అరుణ్ కుమారు తెలిపారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. జీనుగారి రాజుకు 19 సంవత్సరాల క్రితం లావణ్యతో పెళ్లయింది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి గత నాలుగు సంవత్సరాల నుండి కామరెడ్డిలో ఉంటూ సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే రాజు కల్లు, జూదం ఇతర చెడు వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. దాంతో జీవితంపై విరక్తి చెంది లింగంపేట్‌లోని తన కూలిపోయిన పాత ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు


నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ గ్రామానికి చెందిన గిరుకు శ్రీనివాస్ కుమార్తె గిరుకు రమ్యశ్రీ అనే బాలిక అదృశ్యమైంది. శనివారం ఉదయం కాలేజీకి వెళుతున్న అని ఇంట్లో చెప్పి వెళ్లి.. తిరిగిరాలేదు. దీంతో తండ్రి గిరుకు శ్రీనివాస్ ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-గాంధారి



మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీకి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్టు దుర్గానగర్ కాలనీకి చెందిన చింతల మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాలనీకి చెందిన చింతల సాయిలు (55) 18.10.2024న ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఇంట్లో నుంచి వెళ్ళేటప్పుడు తెల్లచొక్కా, నల్ల ప్యాంటు వేసు ఎత్తు 5.0 ఫీట్స్ ఎత్తు కలిగి ఉంటాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గాంధారి ఎస్సై ఆంజనేయులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 8712686165, 8712666228 ఈ నెంబర్లకు తెలుపాలని గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

మూగజీవాలకు గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో గేదెలకు, ఆవులు, దూడలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్టు ఎడపల్లి మండల పశు వైద్యాధికారి ప్రమోద్ కుమార్ శనివారం తెలిపారు. కార్యక్రమంలో పాడి పశువుల యజమానులు దేవుగొండ సంతోష్, పుల్ల నరేష్, పాడి పశువుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడిన దుండగుల అరెస్ట్

నవతెలంగాణ-గాంధారి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

మండలంలోని జువ్వాడి గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం వడ్ల పండరి ఇంట్లో దొంగతనం జరగగా అదే గ్రామానికి చెందిన పండరి బంధువులైన వడ్ల రాకేష్, అతని అన్న అయిన వడ్ల శ్రీకాంత్ ఇద్దరు కలిసి దొంగతనం చేసి.. దొంగిలించిన సొత్తును గాంధారి శ్రీసాయి స్టీల్‌లో అమ్మటానికి ప్రయత్నించగా యజమానికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారిని పట్టుకొని విచారించి వారి వద్ద నుంచి పూర్తి సొత్తును స్వాధీన పర్చుకొని నేరస్తులని జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపినట్టు గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

మంచి నీటి సహాయకులకు శిక్షణా తరగతులు

- డిఈఈ మున్ని నాయక్

నవతెలంగాణ-వర్ని

మండలంలోని రైతు వేదికలో గ్రామాలలోని ఇంటింటికి తాగు నీటి సరఫరా చేసే నీటి సహాయకులకు శిక్షణ తరగతులను శనివారం డిఈఈ మున్ని నాయక్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండల పరిధిలోని పలు గ్రామాల మంచి నీటి సహాయకులకు శిక్షణ తరగతులలో నీటి పై శిక్షణలో పలు సూచనలు చేశారు. నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులుంటాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాత్విక తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, అజయ్, రాజశేఖర్‌రెడ్డి సహాయకులు తదితరులున్నారు.

తల్లితండ్రులు పిల్లల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు రాంచందర్

నవతెలంగాణ-నిజాంసాగర్

తల్లిదండ్రులు తమ పిల్లల అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంచందర్ అన్నారు. శనివారం పాఠశాల పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి నిర్వహణ, బడి అభివృద్ధికి సంబంధించిన పనులలో విద్యార్థులు తల్లిదండ్రులు స్వచ్ఛందంగా పాల్గొని పనులు చేపట్టాలని ఆయన తెలిపారు. విద్యార్థులు ఇంట్లో చదువుకునేందుకు వీలుగా ఇంట్లో ఒక ప్రదేశాన్ని వారికి ఏర్పాటు చేయాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పుడు కనిపెట్టుకుంటూ ఉండాలని, పిల్లలు సమయానికి పాఠశాలకు వెళ్తున్నారా ఎలా చదువుకుంటున్నారని రోజువారి విషయాలను పరిశీలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంఘమిత్ర, షాదుల్లా, సీఆర్పీలు నర్సింలు, శ్రీధర్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-దోమకొండ

విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రతి రోజు కళాశాలకు హాజరై విద్యాబుద్ధులు నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం దోమకొండ కళాశాల విద్యార్థుల ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం రాష్ట్రంలో చివరి స్థానంలో ఉందని విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు రావాలని, అటెండెన్స్ హాజరు ప్రతీ రోజూ ఉండాలని, అధ్యాపకులు చెప్పిన బోధన పాఠాల్ని ఎప్పటికప్పుడు అర్థం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఏదైనా సమస్యలుంటే కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తెలియజేయాలన్నారు. తమ పిల్లలు రోజు కళాశాలకు వెళ్తున్నారా లేదా అని తెలుసుకోవాలని, కళాశాలకు విద్యార్థులు హాజరు కాకపోతే వారి తల్లితండ్రులకు సమాచారం అందించాలన్నారు. ఆర్టీసీ బస్సులు జూనియర్ కళాశాల వద్ద ఆపేటట్టు, వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కోసం సమయానుకూలంగా బస్సులను నడిపే విధంగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడతానని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హామీనిచ్చారు. కళాశాలల్లో మంచినీటి సమస్యను పరిశీలిస్తామని, కళాశాలలో 299 మంది విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్నారని, ప్రతీ రోజూ 100 నుంచి 150 మంది పిల్లలు మాత్రమే హాజరవుతున్నారని, అధ్యాపకులు చెప్పే బోధనకు తప్పనిసరిగా హాజరు, ఉత్తీర్ణతశాతం పెంచాలని సూచించారు. కళాశాలలో ప్రతీ నెల పేరెంట్స్ తల్లి తండ్రుల కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని, కళాశాలకు విద్యార్థులు ప్రతిరోజు హాజరయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సలాం, తహసీల్దార్ సంజయ్‌రావు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి..

పాఠశాల స్థాయి నుంచే రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ అంబాసిడర్స్‌కు అవగాహన, క్విజ్ పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవడంతో పాటు, తోటి విద్యార్థులకు, తల్లిదండ్రులకు, కుటుంబీకులకు, ఇరుగుపొరుగు వారికి తెలియపరుస్తూ అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని వివిధ 61 పాఠశాలల్లో 122 మంది అంబాసిడర్స్‌లను నియమించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ రూల్స్ తెలియడం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ.. జిల్లాలో 520 గ్రామాలుండగా గత సంవత్సరం సుమారు 500లకు పైగా ప్రమాదాలు జరిగాయని తెలిపారు. ప్రతీ రోజూ ప్రతీ ఒక గ్రామంలో ప్రమాదం జరిగినట్లు అవగతం అవుతున్నదన్నారు. జిల్లాలో రెండు జాతీయ రహదారులున్నాయని, ప్రతీ వాహన చొదకుడు అప్రమత్తంగా వాహనాలను నడిపించాలని కోరారు. ప్రమాదాలు చేసినవారికి కొత్త చట్టం ప్రకారం 10 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. జిల్లా విద్యా శాఖాధికారి రాజు, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీసు అధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

నేడు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే టీయూసీఐలో ఐఎఫ్టీయూ విలీన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర కమిటీ నాయకులు బి.మల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణం రాకాసిపేట్‌లో గల వాటర్ హౌస్ వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంపై దాడి తీవ్ర మౌతుందన్నారు. ఆయా దేశాల ఆర్థిక సంక్షోభాల పర్యావ స్థానాల్లో, శ్రమ శక్తులపైనే తమ ప్రతాపాన్ని చూయిస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో సైతం పాలకవర్గాలు ప్రజలపై, కార్మికులపై దోపిడీని, అణిచివేతను పెంచుతున్నాయన్నారు. లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్‌ల తర్వాత యజమానులు కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని, కార్మికులను, ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన కాకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో నియమించుకుంటున్నారని తెలిపారు. దేశంలో కార్మికులు అనుభవిస్తున్న పాక్షిక చట్టాలను సైతం సవరించి యజమాన్యాలకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం మార్చి వేస్తున్నదని మండిపడ్డారు. ఈ విషయాలన్నింటినీ చర్చించుకుని, భవిష్యత్తు దిశా నిర్దేశానికై, దేశవ్యాప్త ఉద్యమ నిర్మాణంలో భాగస్వామ్యానికై అక్టోబర్ 20న నిర్వహించే విలీన సభకు అధిక సంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జే.మక్కయ్య, జ్ఞానేశ్వర్, వి.శంకర్, పోశెట్టి, సురేష్, దరి, గంగారాం, జి.రాజు, సత్యనారాయణ, గంగాధర్, నారాయణ, రాజేందర్, సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీయూ

నవతెలంగాణ-బోధన్

పరీక్ష పేపర్ల దిద్దుబాటులో ప్రొఫెసర్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏబీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సాయికుమార్ అన్నారు. శనివారం పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో విలేకరులతో మాట్లాడారు. సెమిస్టర్ ఫలితాల్లో అవకతవకలు జరిగాయని, సెమిస్టర్ పరీక్ష పత్రాల దిద్దుబాటులో ప్రొఫెసర్ల నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. గత మూడేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోగల అనేక డిగ్రీ పీజీ కళాశాలలో సెమిస్టర్ పరీక్షలు ఎంతో అద్భుతంగా రాసినటువంటి విద్యార్థులకు పరీక్ష ఫలితాలలో మాత్రం ప్రతిసారి చేదు అనుభవం ఎదురవుతుందన్నారు. మే నెలలో నిర్వహించిన డిగ్రీ 2,4,6 రెగ్యులర్ సెమిస్టర్ల ఫలితాలలో అనేక మంది విద్యార్థులు ఒక్కో సెమిస్టర్‌లో మూడు నాలుగు పేపర్లు ఫెయిల్ అయ్యారని తెలిపారు. మళ్లీ రీవాల్యుయేషన్ ఫీజు కట్టి గత మూడు రోజుల కిందట రివాల్యుయేషన్ ఫలితాల్లో అనేకమంది విద్యార్థులు 70, 80 శాతం అదే పేపర్లో ఉత్తీర్ణత సాధించారన్నారు. దీన్నిబట్టి చూస్తే తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పరీక్ష పేపర్ల దిద్దుబాటులో ప్రొఫెసర్ల నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. ఒకవైపు స్కాలర్‌షిప్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు రాక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అది సరిపోనట్టు విద్యార్థుల నుంచి ఈ అక్రమ దోపిడీలను ప్రభుత్వం ఖజానా నింపుకోవడానికి మాత్రమేనా? అని ప్రశ్నించారు. తక్షణమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవితేజ, కీర్తన, అమూల్య, వెంకటేష్, కార్తీక్, కావేరి, మనీషా, అరుణ్, నరసింహ, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

